క్లుప్తంగా

రెవెన్యూ రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ సిసోడియా

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పి.సిసోడియా రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఎస్.కోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. వేపాడ మండలానికి చెందిన కొన్ని భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ఎస్.కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో భూముల కొనుగోలు, రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అవకతవకలు జరిగాయన్న విమర్శలు ఉన్నాయి. ఈ తరుణంలో సిసోడియా తనిఖీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

విద్యార్థినులకు అభినందన



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో కళాశాల లెక్చరర్లు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న బరిణికాన హారిక, పంపాన మౌనిక జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్.కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, లెక్చరర్లు సుధీర్, వలీఖాన్, భాస్కర్, జి.ఈరన్న, శ్రీలక్ష్మి, తదితరులు శుక్రవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

ఏటీఎం సాగు విధానంతో నిరంతర ఆదాయం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి హేమసుందర్

బొండపల్లి: ఏటీఎం విధానంలో ఏడాది పొడవునా బహుళ పంటలు సాగు చేయవచ్చని, తద్వారా రైతులకు నిరంతర ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ అధికారి హేమసుందర్ అన్నారు. మండలంలోని కొవ్వాడపేటలో ఏటీఎం విధానంలో సాగుచేస్తున్న కూరగాయల క్షేత్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏటీఎం విధానంలో తక్కువ విస్తీర్ణంలో, తక్కువ ఖర్చుతో ఏడాది పొడవునా కూరగాయల పంటలు సాగు చేయవచ్చన్నారు. కేవలం 20 సెంట్లు విస్తీర్ణంలో సాగు భూమిలో 20 రకాలైన కాయగూరలు, ఆకు కూరలను ఒకేసారి సాగు చేసి వచ్చిన దిగుబడిని అమ్ముకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. అలాగే ఘన జీవామృతంతో విత్తనశుద్ధి చేసి నాటు కోవడం ద్వారా చీడపీడల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం రైతు శాస్త్రవేత్త మోపాడ కిశోర్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: మండలంలోని 33 కేవీ విద్యుత్ లైన్‌లో రణస్థలం ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పూడి హరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏనుగుల గుంపు బీభత్సం



పెదరాజులగుమ్మడలో ఏనుగులు ధ్వంసం చేసిన మోటారు, పైప్‌లైన్‌ను చూపిస్తున్న రైతు వెంకటనాయుడు

వంగర: మండలంలోని వీవీఆర్ పేట, పెదరాజులగుమ్మడ గ్రామాల మధ్య ఏనుగుల గుంపు పంటలను నాశనం చేస్తున్నాయి. గత ఆరు రోజులుగా ఈ రెండు గ్రామాల మధ్య తిష్టవేసిన ఏనుగుల గుంపు చెరకు, వరి, మొక్కజొన్న, పామాయిల్ తోటలను ధ్వంసం చేస్తున్నాయి. పెదరాజులగుమ్మడ గ్రామ రైతు ఆలుబిల్లి వెంకటనాయుడుకు చెందిన పామాయిల్ మొక్కలతో పాటు మోటారు, డ్రిప్ ఇరిగేషన్ పైపులను శుక్రవారం ధ్వంసం చేశాయి. ఏనుగులను మళ్లించి పంటలను కాపాడాలని వీవీఆర్ పేట ఉపసర్పంచ్ మరిచర్ల విజయలక్ష్మి, గ్రామ పెద్దలు కోరారు. డీటీ బూరాడ సుందరరావు అటవీశాఖ అధికారులతో కలిసి ఏనుగుల గుంపును పరిశీలించారు. ప్రజలు అప్రమత్తం ఉండాలని కోరారు. ఎలిఫెంట్ ట్రాకర్స్ ప్రజలను అవగాహన కల్పించాలన్నారు.

అందని బిల్లులు.. పూర్తవని పనులు



ఆర్‌అండ్‌బీ అతిథిగృహం

- నత్తనడకన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ మరమ్మతులు
- గత ప్రభుత్వంలో రూ.36 లక్షలు నిధుల మంజూరు
- ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆలస్యం

చీపురుపల్లి: ఇప్పుడైతే హోటళ్లు, ప్రైవేటు అతిథి గృహాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ కొన్నేళ్ల కిందట ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మండలాలకు వస్తే కాసేపు సేద తీరేందుకు, విశ్రాంతి తీసుకొనేందుకు రహదారులు, భవనాల శాఖకు చెందిన అతిథి గృహాలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో ప్రైవేటు హోటళ్లు అందుబాటులో ఉండటంతో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లు నిరుపయోగంగా మారాయి. 2019కి ముందు ఉన్న ప్రభుత్వాలు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ల కోసం కనీసం పట్టించుకోలేదు. దీంతో నియోజకవర్గ కేంద్రాల్లో ఉండే ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీవీపీలకు వసతి ఎలాగూ లేదు సరికదా.. కనీసం ఆర్‌అండ్‌బీ అధికారులు కూర్చునేందుకు కూడా నిలువ నీడ లేకుండాపోయింది. పట్టణంలోని రాజాం రోడ్‌లో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథిగృహ పరిస్థితే ఇందుకు నిదర్శనం. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అతిథి గృహాలను మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని గత ప్రభుత్వం భావించింది. అందుకు నిధులు కూడా కేటాయించింది. ఈ లోగా ప్రభుత్వం మారడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.36 లక్షలు మంజూరు..

ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఎన్నికల ముందే రూ.36 లక్షలు నిధులు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. టెండర్లు దిక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడం జరిగింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పనులు చేపడుతున్న కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. బిల్లులు చెల్లిస్తే తప్ప పనుల్లో పురోగతి ఉండదని స్పష్టమవుతోంది.

పూర్తిస్థాయిలో సదుపాయాలు..

గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.36 లక్షలు నిధులతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అవసరమైన మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం భవనం ఫ్లోరింగ్, రంగులు, ఫ్లోర్ టైల్స్, రన్నింగ్ వాటర్ సదుపాయం, పీవీసీ తలుపుతు, మరుగుదొడ్లు, రెండు గదులకు ఏసీలు, సోఫాలు, ప్రహరీ, వాచ్‌మన్ క్వార్టర్ పనులు చేపట్టారు. పనులు పూర్తయితే పూర్తిస్థాయి సౌకర్యాలతో గెస్ట్ హౌస్ అందుబాటులోకి రానుంది. దీంతో పాటు ఇద్దరు వాచ్‌మన్‌లు, ఒక అటెండర్ పోస్టు కూడా మంజూరు చేయనున్నట్లు గత ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా పౌష్టికాహారం పంపిణీ



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దీపక్ లోంధే, సునీత, తదితరులు

గంట్యాడ: అంగన్‌వాడీ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించాలని రీసెర్చ్ ఆఫీసర్ (న్యూఢిల్లీ) డాక్టర్ దీపక్ లోంధే అన్నారు. మండలంలోని నరవ 1,2 అంగన్‌వాడీ కేంద్రాలను, కొఠారుబిల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని స్టేట్ కన్సల్టెంట్ సునీతతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ అమలు ఏవిధంగా జరుగుతుందనేది పరిశీలించేందుకు వచ్చినట్టు చెప్పారు. దేశంలోని 6 రాష్ట్రాల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా పౌష్టికాహార పంపిణీని పైలెట్ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మన రాష్ట్రంలో విజయనగరం జిల్లాలోని విజయనగరం, గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టులను ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ శాంతకుమారి, సీడీపీఓ దోకుల ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు అక్షరాస్యత వేదిక వార్షికోత్సవం



వీరజవాన్ రవివర్మ తల్లిదండ్రులను సన్మానిస్తున్న వేదిక ప్రతినిధులు

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో ఓటరు అక్షరాస్యత వేదిక తొలి వార్షికోత్సవాన్ని వ్యవస్థాపకులు డి.సూర్యారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికల వ్యవస్థలో లోపాలను ఎత్తిచూపేందుకు 1999లో ప్రొఫెసర్ త్రిలోచనశాస్త్రి, జగదీష్ చొకర్, డా.అజిత్‌రనడే ఏడీఆర్ సంస్థను ఏర్పాటు చేయగా.. జయప్రకాశ్‌నారాయణ ఎఫ్‌డీఆర్‌ను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వీరజవాన్ గనివాడ రవివర్మ తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి స్థానిక వైద్యులు ఆర్.త్రినాథరావు, జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ ఎం.కొండలరావు, లైబ్రేరియన్ డి.శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు ఆర్.సూరిదేముడు, సి.హెచ్.రామకృష్ణ, మొల్లేటి అప్పారావు, మురళి, లోకేష్, డి.మేఘన తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించే గొప్ప నాయకుడు వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా.సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ.. దేశంలో అన్ని రాజకీయ పార్టీలు గౌరవించే గొప్ప నాయకుడు, పార్లమెంటేరియన్ వాజ్‌పేయ్ అని కొనియాడారు. రానున్న తరాలు వాజ్‌పేయ్‌ని ఆదర్శంగా తీసుకుని గొప్ప నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్సై



జి.రాజేష్, ఎస్సై

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.భూర్జవలస ఎస్సైగా జి.రాజేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం టూటౌన్ స్టేషన్‌లో ఎస్సైగా చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఇదే స్టేషన్‌లో కొద్ది నెలల పాటు ఎస్సైగా విధులు నిర్వహించారు.

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికలు

గుర్ల: మండలంలోని పాలవలస, పెద్దబంటుపల్లి, కలవచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, గూడెం, పకీరుకిట్టాలి ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలు వివిధ కారణాలతో వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆయా పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలను శనివారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ భానుప్రకాష్ శుక్రవారం తెలిపారు. సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నేతలు సహకరించాలని కోరారు.

నగదు ప్రోత్సాహకం అందజేత



లోహిత్‌కుమార్‌కు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న రమేష్

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ తన తండ్రి తాతారావు స్మారకార్థం ఏటా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.లోహిత్‌కుమార్‌కు రూ.3 వేలు, టి.షణ్ముఖ్‌కు రూ. 2 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని శుక్రవారం అందజేశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

వరలక్ష్మీ నమోస్తుతే..!

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం నాడు భక్తులు వరలక్ష్మీదేవిని పూజించి వ్రతాలు ఆచరించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలతో వరలక్ష్మీదేవిగా అలంకరించి, తొమ్మిది రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేశారు. శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తే అష్టైశ్వర్యాలు, సకల సౌభాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం.

– చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం



చీపురుపల్లి: గాజుల అలంకరణలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు



గుర్ల: పున్నపురెడ్డిపేటలో దుర్గాదేవిని పూలతో అలకరించిన భక్తులు



ఎస్.కోట: పుష్పాలంకరణలో దుర్గమ్మ



వేపాడ: విశేషాలంకరణలో శ్రీదేవీ భూదేవి సమేత కళ్యాణవేంకటేశ్వరస్వామి



బొండపల్లి: రాజరాజేశ్వరిదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న జెడ్పీటీసీ గారతవుడు, తదితరులు

గజపతినగరం: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. గజపతినగరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఇంటి వద్ద బొత్స సత్యనారాయణను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ గారతవుడు, పార్టీ సీనియర్ నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, పల్లి సంజీవరావు, కర్రి రామునాయుడు, ఇనుముల రాజు, లోగీశ శ్రీను, ఆదాడ గోపి, రాపాక సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు



పెదమానాపురంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి

దత్తిరాజేరు: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వైజాగ్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పెదమానాపురంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి ఇంటి వద్ద శుక్రవారం రాత్రి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఉత్తరాంధ్రకు పెద్ద దిక్కు అయిన బీసీ నేతను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి పక్క జిల్లాకు తీసుకువెళ్లి ఎమ్మెల్సీగా గెలిపించడంతో బీసీలపై ఆయనకు ఉన్న అభిమానాన్ని మరొకసారి చాటుకొన్నారని అన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు



చీపురుపల్లి: ఏయూ వైస్ ఛాన్సలర్ చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న విజయేశ్వరరావు

చీపురుపల్లి: ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ యూనిట్–2 పీఓ డా.బి.విజయేశ్వరరావు ఎంపికయ్యారు. పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా గురువారం వర్సిటీ వైస్ ఛాన్సలర్ శశిభూషణరావు చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. ఏయూ పరిధిలో ఉత్తమ పీఓగా అవార్డు దక్కించుకున్న విజయేశ్వరరావును స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీ కృష్ణాజీ, అధ్యాపకులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

శృంగవరపుకోట: స్థానిక సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్) స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ వై.విజయలక్ష్మి ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో జాతీయ సేవా పథకం ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ జి.శశిభూషణరావు చేతులమీదుగా గురువారం అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం అరుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర ఉపన్యాసకులుగా, ఎన్ఎస్ఎస్ పీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

శృంగవరపుకోట: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ డిపో గేట్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై డిపో మేనేజ్‌మెంట్ చర్చలు జరిపినప్పటికీ ఇంతవరకు వాటిని పరిష్కరించకుండా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. యాజమాన్య వైఖరిని ఖండించారు. అన్యాయంగా విధుల నుంచి తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని, ఏడీసీలను సఫలింగ్ చేయాలని, ఖాళీలను భర్తీ చేయాలని, ప్రతి ఉద్యోగికి 2 రోజులు సెలవు ఇవ్వాలని, వెహికల్ కండిషన్ మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ఎస్.రాములు, డిపో సెక్రటరీ చంద్రమౌళి, డిపో అధ్యక్షుడు ఎ.రాజయ్య, జి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి



హాస్టల్ వార్డెన్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. వసతిగృహాల నిర్వహణపై కొత్తవలస, శృంగవరపుకోట మండలాల్లో ఉన్న 5 వసతి గృహాల వార్డెన్లుతో సమీక్షించారు. హాస్టల్‌లో ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారు, వారికి అందుతున్న సౌకర్యాలు, భోజన మెనూ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మిగులు సీట్ల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు కొల్లు రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.